పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేది: 28.07.2014

క్రిష్టియన్లకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో వున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చిలో ఖాళి అయ్యే ఎమ్మెల్సి స్థానాన్ని క్రిష్టియన్లకు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

నిజామాబాద్ ఎమ్మెల్సి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో వివిధ క్రిష్టియన్ సంఘాలకు చెందిన మత పెద్దలు గొల్లపల్లి జాన్, జానతన్ కల్వల, ఎపి.సాల్మన్, ఇ.డి.యస్.రత్నం, పాల్ ఆరాధన, నెహ్రు ధైర్యం తదితరులు సచివాలయంలో సోమవారం ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ సర్వతో ముఖాభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖంగా వుండాలని, కేసిఆర్ పాలన దిగ్విజయంగా కొనసాగాలని ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థన చేశారు. క్రిష్టియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కేసిఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పూర్తి స్థాయిలో లౌకిక స్ఫూర్తిని కాపాడే రాష్ట్రంగా నిలుస్తుందని, ఇతర రాష్ట్రాలు తెలంగాణను చూసి పాఠాలు నేర్చుకుంటాయని అన్నారు. క్రిష్టియన్లకు ఎమ్మెల్సి పదవి ఇస్తామని, దాని ద్వారా క్రిష్టియన్లు తమ సమస్యలను చట్ట సభల్లో చెప్పుకునే అవకాశం వుంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ పదవిని కూడా రాజకీయ కోణంలో కాకుండా క్రిష్టియన్ మత పెద్దలంతా కలిసి సూచించిన వ్యక్తికే ఇస్తామని ప్రకటించారు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు అధికారికంగా ఇఫ్తార్ విందు ఇచ్చినట్లుగానే క్రిష్టియన్లకు కూడా క్రిస్టమస్ నెలలో ప్రభుత్వం తరపున ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక ఉత్తరువులు జారీ చేస్తుందని, ముఖ్యమంత్రి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కేసిఆర్ తెలిపారు. గ్రామాలలో, పట్టణాలల్లో చర్చిలు నిర్మించుకోవడానికి కలెక్టర్ల నుండి అనుమతి తీసుకోవలసిన అవసరం లేకుండా కూడా ప్రత్యేక ఉత్తరువులు జారీ చేస్తామని సిఎం వెల్లడించారు. దేవాలయాలు, మసీదులు కట్టుకోవడానికి ఏలాంటి నిబంధనలు వున్నాయో చర్చిలు నిర్మించడానికి కూడా అలాంటి నిబంధనలే వుండే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో క్రిష్టయన్ల కోసం ప్రత్యేకంగా గ్రేవ్ యార్డులు ఏర్పాటు చేస్తామని చెప్పిన సిఎం, ఇందుకోసం స్థల సేకరణ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. క్రిష్టియన్లకు మూడు శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా వుంటుందని వెల్లడించారు.

ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించే అవకాశాలపై అధ్యయనం చేయడానికి హైకోర్టు జడ్జి స్థాయిలో కమిటీ వేసి అధ్యయనం చేపిస్తున్నామని, క్రిష్టియన్లకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కూడా అధ్యయనం చేసి సానుకూల నిర్ణయం తీసుకొంటామన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి జనాభా ప్రాతిపదికన అవకాశాలు దక్కాలనేది తమ అభిమతమని వెల్లడించారు. తమిళనాడు తరహాలో ప్రత్యేక మినహాయింపులు కూడా తీసుకొని రిజర్వేషన్ల శాతాన్ని పెంచుకుంటామని స్పష్టం చేశారు. చర్చిల నిర్మాణానికి, ఇతర అవసరాల కోసం కూడా నిధులు మంజూరు చేసే అవకాశాలను పరిశీలిస్తామని కేసిఆర్ చెప్పారు. కొన్ని చోట్ల క్రైస్తవ మత ప్రచారకులు, ఫాస్టర్ల మీద దాడులు జరుగుతున్నాయని మత పెద్దలు కేసిఆర్ దృష్టికి తీసుకురాగా, భవిష్యత్తులో అలా జరుగకుండా పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. భారత రాజ్యాంగం తన ప్రవేశికలోనే భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించిందని, రాజ్యాంగంపై ప్రమాణం చేసిన తామంతా అందుకు కట్టుబడి వుండాలని చెప్పారు. హైదరాబాద్ ప్రత్యేక దేశంగా, రాష్ట్రంగా వున్న సమయంలో కూడా ఇక్కడ మత సామరస్యం వెల్లివిరిసిందని, నిజాముల కాలంలో కూడా హైదరాబాద్‌లో పెద్ద చర్చిల నిర్మాణం జరిగిందని కేసిఆర్ చెప్పారు. మహాత్మాగాంధీ కూడా హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని చూసి ఆనంద పడ్డారని చెప్పారు. మత సామరస్యం విషయంలో ప్రపంచానికే పాఠాలు నేర్పిన హైదరాబాద్‌ను ప్రత్యేక రాష్ట్రంగానే వుంచాలని ఫజల్ అలీఖాన్ కూడా తన నివేదికలో పేర్కొన్నారని కేసిఆర్ చెప్పారు. అయితే సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత తెలంగాణలో మత సామరస్యానికి అప్పుడప్పుడు విఘాతం కలిగిందని, ఇందుకు సీమాంధ్ర పార్టీలు, నాయకులు పెట్టిన కుల కుంపట్లు, రగిల్చిన మత విద్వేషాలే కారణమని కేసిఆర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అసలు సిసలు మత సామరస్యం అమలవుతుందని, తెలంగాణను చూసి మిగతా రాష్ట్రాలు కూడా పాఠాలు నేర్చుకోవాలని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం.